కథానిక:

'బలీయసీ కేవలమీశ్వరాజ్ఞా'

•

శ్రీ ఇ. సరస్వతీదేవి

ఆ నాడు వైశాఖపున్నమి. బ్రాహ్మణులను, బీదసాదలను ఆ ఊరి జమీందారిణి ఆదినము సత్కరించే అలవాటు. అరఎకరము ఆక్రమించిన ఆ భవనముచుట్టూ తాటియాకు పందిళ్లు వేశారు.

పాడ్యమినుండీ జమీందారిణికి తీరిక లేదు. దానధర్మాలకు ఎవరికి తగినట్లుగా వాళ్లకు పట్టిక తయారుచేయించి వస్తుసామగ్రి సిద్ధపరిచింది.

పౌర్ణమినాడు తెల్లవారుజామునలేచి తలంటి నీళ్లు పోసుకుని దైనికపూజ ముగించుకొని పందిటిలో ప్రవేశించింది. సుమారు ఏడుగంటలకు సత్కారము ప్రారంభము చేసింది. బ్రాహ్మణులు మంత్రసూక్తాలు, శ్లోకాలు, పద్యాలూ చదివి ఇచ్చినవి పుచ్చుకొని దీవించిపోతున్నారు. సాధువులనూ, బీదలనూ ఆమె స్వయంగా సత్కరిస్తున్నది; కాని ఆమె విశాలనేత్రాలు పందిట్లోకి వరుసగా వచ్చే గుంపులను వెతుకుతున్నాయి. ఆదుర్దాగా ఇటూ అటూ చూస్తూ, ఇంకా రాలేదేమని నోట్లో గొణుక్కుంటున్నది. సహస్రకిరణుడు చరచర పైకెక్కి వస్తున్నాడు. ఇక ప్రతీక్షింపలేక, "వీరయ్యా, ఇంకా చెల్లమ్మ రాలేదు. అక్కడికీ నిన్న సాయంకాలము కబురు పంపాను సుమా. నీవు వెళ్ళి స్వయంగా తీసుకురా. అద్దాలబండి తీసుకువెళ్ళు." మాట పూర్తముకాక ముందే వీరయ్య కదలివెళ్లాడు.

అంగవస్త్రాల చెంబులదొంతరలు తరిగిపోయాయి. బీదల కిచ్చే ధాన్యపుబస్తాలు ఖాళీఅయాయి. రవిక పీటీల పళ్లెం పట్టినయాయి. పందిట్లో జనసమ్మర్దము పలచనయింది. వెళ్లిన అరగంటకే వీరయ్య బండితో వచ్చాడు. బండిలోనుంచి ముప్ఫయిఏళ్ల చెల్లమ్మ ముందుగా దిగి చేతులు పట్టుకొని రామయ్యను దింపింది. కొయ్యకాళ్లతో, చేతుల క్రింద పెట్టుకొన్న కర్రల సహాయంతో రామయ్య నిమిషానికి ఒక అడుగు వేస్తూనూ, చెల్లమ్మ అతనికి ఆసరాగా ప్రక్కనుంచి నడుస్తూనూ వస్తుంటే హృదయవిదారకమైన ఆ దృశ్యానికి జమీందారిణి కళ్లవెంట ఆపలేని అశ్రుప్రవాహము బయలుదేరినది. కొత్తగా ఆదృశ్యము చూసేవారికి కళ్లవెంట వచ్చేవి నీళ్ళు కాదు, రక్తపుబొట్లు. ఆదృశ్యము ఆమె నాలుగు సంవత్సరాలుగా చూస్తూనే ఉంది. ప్రతీఏటా గుండె పగిలే ఆ దుఃఖము ఆమెకు కలుగుతూనే ఉన్నది. ఏనాడు ఆదంపతుల దర్శనముతో తన హృదయము విప్పారి ప్రేమాంకుర మేర్పడినదో ఆ వైశాఖ పున్నమి నుండి దాని స్మారక చిహ్నముగా ప్రతిఏటా బ్రాహ్మణ బీదసాదల సత్కారము ప్రారంభించింది.

* * *

జమీందారిణి శకుంతలాదేవి వేసవికాలములో తన భవనమును చల్లగా ఉంచే ఏర్పాట్లు చేయిస్తున్నది. ఫిబ్రవరి నెలలోనే 'నీలగిరి వెళ్ళటమూ బెంగుళూరు వెళ్లటమూ' అని యోచించి ఏర్పాట్లు చేసుకునే ఆమెకు, రెండేళ్లక్రింద పెద్ద విపత్తు తటస్థించింది. బలంగా లేచి తిరుగుతూ తిరుగుతూన్న జమీందారుకు రెండు దినాల జ్వరంతో మాటనిలిచిపోయింది. స్థలము కదల్చకుండా చికిత్స చేసిచూడాలని ఘనవైద్యులయిన స్థానికులు తంటాలు పడుతున్నారు. అందుకనే పందిళ్లతోటి, తడకలతోటి ఉన్నచోటనే చల్లదనము ఆపాదించాలని సకలప్రయత్నాలూ చేస్తున్నది జమీందారిణి.

ఆ ఉదయమే మేదరిగుడిసెలలోనుంచి చెల్లమ్మ రామయ్యల జోడా జమీందారుగారింటికి తడకలు తీసు

కొని బయలుదేరింది. పల్లెపదాలతో, యౌవనపు సరాగాలతో, ఒకరి నొకరు తోసుకుంటూ, రాసుకుంటూ రాచభవనము సమీపించేసరికి ఎనిమిది దాటింది.

"పడమరన ఉన్న గదిముందర వసారా మాదిరిగా వంపుగా తడక కట్టిస్తే ఎండయొక్క తీక్షణం లోపలికి రాకుండానూ, గాలి వచ్చేటట్లుగానూ ఉంటుం"దని జ మీ ం దా రి ణి శకుంతలాదేవి పేదరి రామయ్యకు చెప్పి తన గదిలోకి వెళ్ళిపోయింది.

"మామా, అక్కడొక్కటీ ఇక్కడొక్కటీ గడలు పాతు. పురికొస జేబులో పెట్టుకో. నిచ్చెన వేసుకో. ఊఁ, దోవతి పైకి కట్టు..."

"చెప్పేదానికేగాని చేసేదానవా ఏమన్నానా? గునపము తీసుకురా."

గజములోతు గుంటలు తవ్వి గడలు దింపుతున్నాడు రామయ్య. గడ్డపార తిరగవేసి మట్టితో పూడ్చినమీదట దిమ్మిసచేస్తున్నది వెల్లమ్మ. ఈ రెండూ పూర్తి చేసి రామయ్య గోడకు నిచ్చెన వేసుకున్నాడు. సుమారు పన్నెండుగజాల ఎత్తునుంచి ప్లోపు దింపుకుంటూ, ఆరేడు గజాల ఎత్తుకు తీసుకొని రావాలి. ఒక నిచ్చెన పొడుగు చాలక రెండింటిని కలిపి, తాళ్లతో గట్టిగా బిగించి కట్తున్నాడు.

"మామా, రెండింటిని—ఒకదానితో ఇంకొదాన్ని కలిపి, తాటితో గట్టిగా బిగించి కట్తున్నావు కదూ. నీ బిగింపు సళ్లిచ్చినా, రెంటినీ బంధించే తాడు బలహీనమయినా ఏ మవుతుందో ఊహించావా మామా."

"ఊహించకేం! రెంటినీ బంధించే యీతాడు సన్నగిల్లినా, బిగింపు సళ్లిచ్చినా, ఊగుతూ, ఏ క్షణానికి విడిపోతావో అన్నట్లుగా ఉంటాయి నిచ్చెనలు. నేనయితే గట్టిగానే కట్తున్నానే."

"పైకెక్కే ముందర చెమట తుడువనీ. గంజి నీళ్లు కాస్తా అరిగిపోయినట్లుంది అప్పుడే. కాస్త చద్ది అన్నము మూటకట్టుకొచ్చానే. ఈ పైపు తడక కట్టిన తరువాత తిందుగాని."

"నే నొక్కణ్ణా?"

"నేనూను. నేనే కలిపి ముద్దలు చేస్తాకదూ?"

కూనిరాగాలు తీస్తూ నిచ్చెనమెట్లు ఎక్కుతున్నాడు. పురికొస, పెద్దకత్తి, మేకులు జేబులో పెట్టుకొని, కిందికి చూస్తూ పైకి ఎక్కిపోతున్నాడు.

"నిచ్చెన గట్టిగా పట్టుకోవే."

"గడియలో యీ తడక మేకులకి తగిలించేయి. చూద్దాము నీ పనితనము"

కిటికీలోనుంచి జమీందారిణి వీరిద్దరి కబుర్లూ వింటున్నది. వీళ్లిద్దరి సరాగాలూ చెవిన పడుతూనే ఉన్నాయి.

"ఏమిటే, మీరు మాటలతోటి పొద్దు పుచ్చుకోవటానికి వచ్చారా? పని జరగటం లేదు."

"కోరసానీ, నన్ను పని చెయ్యనివ్వకుండా మాటలతోటే పాటలతోటే అడ్డుపెట్టాలని చూస్తోంది. కాని, నాచేతులు పనిచేస్తూనే ఉన్నాయి." అన్నాడు పైకెక్కుతున్న రామయ్య.

"ఏయ్ అమ్మీ! నీవు సిగ్గయినా లేకుండా వాడి నెందుకు ఊరికే పలకరిస్తావు? పనికి అడ్డం కదూ!"

"అమ్మా! నామాటలు వింటుంటేగాని ఆయన పని చేయలేడు. పోనీ, కాస్త నే వట్లా వెళ్తాను; నిజంగా ప నెంత సాగుతుందో చూడండి."

"ఆఁహాఁ. అదొకటా యీ పేదరివాడికి?"

జమీందారిణిని లోపలికి పోనిచ్చి, "వాళ్లలాగ నోరుమూసుకొని చేయమంటే మనకు పని ఎక్కడ సాగుతుంది? ఎవరి గదిలో వాళ్లు కూచుని పొద్దు పుచ్చుకుంటారు. వాళ్లకూ ఎక్కువమాటలే ఉండవు. మామా, ఎక్కు పైకి."

"మాటా ముల్లే కట్టి ముసలోళ్లతో చెప్పి యెంకి భద్రాద్రి వెళ్దామా?"

"మామా, ముసలోళ్లు ఏరీ మనకు?"

"నేనా ఆపాట పాడింది? వెళ్లేటప్పుడు చెప్పటానికి, ఎక్కడయినా చూడు ముసలివాళ్లను. పోనీ లే. ఏదీ ఇంకో పదము."

"నాసిన్నితమ్ముణ్ణి నా కియ్యర దొయ్యా ఏడుకొండలవాడ యెంకటేశ్వరులా."

నిచ్చెనమీద కాళ్లు ఆనించి, ఒకచేత్తో పేకు పట్టుకొని, ఇంకో చేత్తో పేదరికత్తి తిరుగవేసి కొట్టు న్నాడు రామయ్య. ధ్యాసంతా పేకుమీద కేంద్రీకరించి కొట్టుతున్నాడు.

ఇంతలోనే పైనుంచి పెద్ద బరువు కిందపడ్డ చప్పుడు! 'అయ్యో! అయ్యో!' అన్న కేకలు పక్క గదిలో ఉన్న జమీందారిణికి వినబడ్డాయి. ఆమె యివతలికి వచ్చి చూసేటప్పటికే కూలీలంతా వాళ్ల చుట్టూ మూగారు. అందరూ ఒక్కసారే, "ఏమయింది-ఏమయింది? ఎట్లా పడ్డాడు?" అని అడుగుతున్నారు. రామయ్య రెండుకాళ్లూ మోకాళ్లక్రిందనుంచి ఊగులాడుతున్నాయి; ముఖమునిండా రక్తము! మాట లేకుండా మూలుగుతున్నాడు.

"అయ్యో, మామా, కాళ్లు...కాళ్లు విరిగిపోయాయా!" అంటూ తడిబట్టతో ముఖము తుడిచి విసరుతున్నది చెల్లమ్మ.

అంతకు ముందు 'మన కే'మని ఘనీభవించి ఉన్న జమీందారిణిహృదయము ఆ దృశ్యానికి ద్రవించింది. వెంటనే కారులో రామయ్యను ఆసుపత్రికి పంపివేసి, కూడా వెళ్తానని చెల్లమ్మ ఏడుస్తుంటే బలవంతంగా ఆపుచేయించి, తానూ అక్కడే అరుగుమీద కూర్చుంది. కూలీజనమంతా చెల్లమ్మను ఓదార్చటములో నిమగ్నమయింది.

"అయ్యో! మామకు కాళ్లు విరిగిపోయాయి. గడ్డంక్రింద రాయి లోతుగా దిగపడిపోయింది. కిందపడేవరకూ నేను చూడనేలేదు. అయ్యో మామా!"

"ఏడవకు పిల్లా. ఇప్పుడే కట్టుకట్టి తీసుకొస్తారు. నీవు చేసిందే మున్నది యిందులో? ఎందుకేడుస్తావు?"

"ఎంత పాటు పడ్డాడు! ఇంకా నేను అన్నము తినిపిద్దామనుకున్నాను. గంజినీళ్లు అప్పుడే అరిగిపోయా యని పిలుద్దామనుకున్నాను. అయ్యో! ఎప్పటివలె నడుస్తాడా మా మామ? లేచిన వేళ మంచిది కాదేమో. బయలుదేరేటప్పుడు వాళ్ల పిల్ల తుమ్మింది. అబ్బా! ఎంత రక్తము కారింది!" అంటూ చెల్లమ్మ ముఖము తిరిగి పడిపోయినది.

ఇంతసేపూ మాట్లాడకుండా కూర్చున్న శేషం తలా జీవిమనసు స్పందించింది. "ఇంత ఆరాటమూ, మానసికో ద్రేకమూనా? కాళపోతే ఇన్నాళ్లనుంచీ కాపురం చేస్తున్న పెనిమిటికి దెబ్బ తగిలి రక్తం కారుతుంటే మనసులో కష్టంగా ఉండవచ్చుగాని ఇదేమిటి! వాడికముందు సంపాదించి తనను పోషించలేడేమో నన్న భయమా దానికి?" అని అనుకుంటూ రెండుగజాల దూరాన నిల్చుని, "ఇటు చూడు. నీ పెనిమిటికి కాళ్లు విరిగిపోతే, ఇక ఎట్లా నిన్ను పోషిస్తాడా అని ఏడుస్తున్నావా?" అని కొంచెము ధీమాగానే అడిగింది.

"అమ్మా, నన్నాయన పోషించలేకపోతే, నేనే పోషిస్తాను. నాకు పేదరిపని వచ్చు; తడకలు అల్లుతాను. అన్ని పేదరిసామాన్లూ తయారుచేస్తా. డబ్బు గడిస్తా. కాని, మామామ నవ్వుకుంటూ నడుచుకుంటూ మరి రాగలడా? అని. అమ్మా, నేను వచ్చి నాలుగేళ్లయింది. ఒక్కనాడయినా నేను మా అమ్మగారి గూడెము పోలేదు; మా మామ తాను కలుపుకొని అన్నము తినలేదు. అయ్యో! మామ కెంతపాటి దెబ్బ తగిలిందీ?"

"మీకులంలో మారుమనువు లేదూ?" అన్నది జమీందారిణి.

"అమ్మ, మారుమనువు ఎవరికి కావాలి తల్లీ! మీ పాదాలకు మొక్కుతాను. మా మామ మనసిచ్చి మనసును పుంజుకునే శక్తి కలవాడు. ఒక్క పొల్లుమాట, ఒక్క కల్లుబొట్టు ఎరగనివాడు." చెల్లమ్మకు నాలుక ఎండిపోయింది. మాట్లాడే శక్తి లేక నేలమీదికి ఒరిగిపోయింది. అంతవరకూ ఊరికే చూస్తూ నిల్చున్న జమీందారిణి ఇక పట్టలేకపోయింది హృదయాన్ని. మంచినీళ్లు తెప్పించి చెల్లమ్మ గొంతులో పోయించి, అరుగుమీద చాపవేయించి

పడుకో పెట్టించింది. తాను విస్మయంతో అక్కడే నిలబడిపోయింది.

* * *

జమీందారిణి శకుంతలాదేవి కాపురానికి వచ్చిన పదిహేనేళ్లల్లో నలుగురుపిల్లల తల్లి అయింది. బాల్యంలో తల్లిదండ్రులు ఆమెకు విద్య చెప్పించే విషయంలో ఎక్కువ శ్రద్ధ వహించలేదు; కాని దాసదాసీజనాన్ని అదుపులో ఉంచుకోవటమూ, జమీందారీఠీవిలో మెలగటమూ, కొంచెముగా సంగీతములో ప్రవేశమూ కలిగించి పంపారు అత్తవారింటికి. ఆమె అహంభావము కల మనిషి, కాదేమో కాని నలుగురితో కలిసిమెలిసిమాత్రం ఉండలేదు. తనతో మాట్లాడవచ్చిన వారితో ముఖాముఖి మాట్లాడదు; ఆమెసమక్షంలో ఆమెదాసి 'అమ్మగారిట్లా అంటున్నా'రని చెప్పవలసినదే. బిడ్డలనయినా ఎప్పుడో దగ్గరికి పిలవటమే గాని ఒక గంటసేపయినా దగ్గర ఉంచుకొని ఎరుగదు. ఒకసారి బిడ్డకు ప్రమాదకరమయిన జబ్బు చేసింది. బిడ్డచర్యలు గమనించవలసిన దని డాక్టరు చెప్పి వెళ్లాడు. మరునాడు ఆయన వచ్చి అడిగినప్పుడు, ఆమె ప్రతివిషయమూ దాసీని ఆయనముందరే అడగవలసివచ్చినది. "నిద్రలో మూలుగుతున్నాడా, దాహమని అడిగాడా?" అని అడిగినప్పుడు దాసీది తృప్తికరమయిన జవాబు ఇవ్వలేకపోయింది. అప్పుడాయన, "యిటువంటివాటికి దాసీలమీద ఆధారపడకూడదండీ" అని అన్నందుకు కోడకాచయి, "నా కేం కర్మమని తెల్లవార్లూ నిద్రపోకుండా కూచోవాలి" అ[illegible]కొని వెంటనే వైద్యుని మార్చివేసింది. భర్తవిష[illegible]మూ అంతే. నిర్ణీతసమయంలో—అధికారితో [illegible]వ్యక్తులవలె సమావేశమే గాని, స్వేచ్ఛగా, కుతూహలంతో, ఉత్సాహంగా వాళ్లిద్దరూ కలిసిమెలిసి ఎరుగరు. వారి భోజన మేమిటో, వారి రుచు లేమిటో, వారి పద్ధతు లేమిటో ఆమె ఎరుగనే ఎరుగదు. వారిద్దరి గదులూ వేరు. వారికి కావలసినవి తెలుసుకొని చేయటానికి ప్రత్యేకంగా సేవకులు ఉండటమువల్లనూ, ఒకరి విషయాలను ఇంకొకరు తెలుసుకోవలెనన్న కుతూహలము తక్కువగా ఉండటమువల్లనూ ఆ దంపతులు ఒకరి నొకరు ఎరుగవలసినంత ఎరుగరు. అందువలననో—మరెందువలననో ఆమెకు వారివద్ద ఉండవలసినంత చన వేర్పడలేదు. ఆమె ఆ విషయంలో ప్రయత్నించనూ లేదు. జమీందారుకు యిటీవల కలిగిన అనారోగ్యము దీర్ఘవ్యాధిలాగ మారే సూచనలు కనబడుతున్నాయి. వారి దర్శనము చేసి ఎన్నిదినాలయిందో ఆమె! వారి వ్యాధిని గురించి ఆమె ఆతృతతో వారి నడగలేదు. అడిగినప్పుడయినా వారు సుముఖంగా జవాబియ్యనూ లేదు. అటువంటి ఆమెకు ఈ పేదరికిల్ల పరిపక్వమైన హృదయము చూస్తే వింతగా ఉంది. ఆమెహృదయానికి యీ పేదరిదంపతుల చర్యలు మొదలు విపరీతముతో కూడిన ఏహ్యముగా కనబడి, చివరకు హృదయానురంజకము లయినవి. ఇంతవరకూ ఆమెహృదయము వారివిషయంలో విచ్చని మొగ్గగానే ఉంది.

"సా కిం న రమ్యా, స చ కిం న రంతా
బలీయసీ కేవల మీశ్వరాజ్ఞా!"

లాగ ఉన్నది తమ దాంపత్యపు ధోరణి.

తన జీవితఘట్టాలను సింహావలోకనము చేసుకుంటున్న శకుంతలాదేవి పేదరిచెల్లమ్మదగ్గర మనిషిని కాపలా ఉంచి, చివ్వున లేచి జమీందారుగదికి చరాచరా నడచింది. తలుపు దగ్గరగా వేసిఉన్నది; సేవకుడు మంచముదగ్గర ఒరిగినాడు; నీరసించిన దేహముతో పక్కకు ఒత్తిగిలి పడుకొని ఉన్న పెనిమిటిని ఒక్కసారి ఆపాదమస్తకమూ వీక్షించినది. సేవకుని బైటికి పంపి, వారికి నిద్రాభంగము చేయలేక పాదములదగ్గరగా స్థాణువువలె నిలిచిపోయినది! కాలికి తగిలిన స్పర్శవల్ల మెలకువ వచ్చి జమీందారు చివ్వున లేచి, చప్పున కాగితము కలము అందుకొని, "దొరసానిగారు యిట్లా వచ్చిన పని ఏమిటి? దాసీ లేమయినారు?" అని వ్రాసి చూపించాడు. ఆమె అది చదివి, "ప్రభూ, నేను మీకు 'దొరసానిగారి'ని కాను. మీ పాదదాస్యము చేయదలచిన అర్ధాంగిని. మన యిద్దరి మధ్యన ఇకనుంచి దాసీలు ఉండరు!" అంటూ మోకరిల్లినది. అత్యాశ్చర్యంలో మునిగిపోయిన జమీందారునికి వెంటనే 'ఆఁ' అంటూ రెండేళ్లనుంచీ నిలిచిపోయిన మాటలు తిరిగి రానారంభించినవి!